క్లుప్తంగా

దసరా ఉత్సవాలు ప్రారంభం

కంచిలి: దసరా ఉత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. జలంత్రకోట గ్రామంలో వెలసియున్న లిమ్మేశ్వరి అమ్మవారి సన్నిధి నుంచి ఉత్సవాలు ప్రారంభమవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు

పలాస: బొడ్డపాడు క్రీడా మైదానంలో సోమవారం ఎస్‌జీఎఫ్ డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. దీనికోసం క్రీడా మైదానాన్ని అధికారులు సిద్ధం చేశారు. పాఠశాల పీడీ పద్మలోచన్ మాట్లాడుతూ.. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో కబడ్డీ, చెస్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

బారువ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా శ్రీను

సోంపేట: బారువ మేజర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా మండల వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీనును కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ యర్ర రజనీ అధ్యక్షతన పార్టీ కార్యకర్తలతో ఆదివారం సమావేశాన్ని నిర్వహించి ఎన్నిక ప్రక్రియను చేపట్టారు. పార్టీ నాయకులు రాజు, అమరలోకనాథం, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కళింగకోమటి సంఘ అధ్యక్షుడికి సత్కారం

సోంపేట: జిల్లా కళింగ కోమటి సంక్షేమ సంఘ అధ్యక్షులుగా సోంపేట పట్టణానికి చెందిన సానా షణ్ముఖరావు ఎంపికయ్యారు. ఆయన్ని సోంపేట సంఘ ప్రతినిధులు ఆదివారం సత్కరించి అభినందించారు. సంఘ ప్రతినిధులు మల్లా నాగేశ్వరరావు, సానా మోహనరావు, మల్లా కాశి పాల్గొన్నారు.

టెక్కలి మాజీ ఎంపీపీ జానకీరామయ్య మృతి



టెక్కలి: టెక్కలి మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తిర్లంగి జానకీరామయ్య ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఈయన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. 2004 నుంచి 2008 మధ్య కాలంలో టెక్కలి ఎంపీపీగా సేవలు అందజేశారు. న్యాయవాదిగా టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా కొనసాగారు. ఈయన మృతిపై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి, ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ, బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

సాక్షిపై అక్రమ కేసులు దారుణం

టెక్కలి: కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, తప్పిదాలపై ప్రజలకు నిర్భయంగా వాస్తవ కథనాలు అందజేస్తున్న సాక్షి మీడియాపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సత్తారు వెంకటరమణ మండిపడ్డారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా సాక్షి ఎడిటర్‌తో పాటు జర్నలిస్టులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం అప్రజాస్వామ్యకమన్నారు. కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బాలికలకు వైద్య పరీక్షలు

టెక్కలి: శ్రీకాకుళం అబ్‌స్టెట్రిక్ అండ్ గైనిక్ సొసైటీ (ఎస్‌ఓజీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలిలో ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సీనియర్ గైనకాలజిస్ట్ ఆర్.అరవింద్ ఆధ్వర్యంలో బాలికలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

డాక్టర్ కావాలనే ఆశయాన్ని చంపేస్తున్నారు

టెక్కలి: పేద విద్యార్థులు డాక్టర్ కావాలనే ఆశయాన్ని కూటమి ప్రభుత్వం చంపేస్తుందని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.గురునాథ్‌యాదవ్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మెడికల్ కళాశాలలు తీసుకువస్తే.. చంద్రబాబు ప్రభుత్వం ఆ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పూర్తిగా దయనీయంగా మారిందన్నారు. ఇప్పుడు మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి డాక్టర్ కావాలనే పేద విద్యార్థుల కలను చిదిమేస్తున్నారని దుయ్యబట్టారు.

పాలకులకు పట్టని డెప్పూరు!

● కానరాని మౌలిక సదుపాయాలు



అధికారులు, పాలకులకు పట్టని డెప్పూరు

ఇచ్ఛాపురం రూరల్:

ఇచ్ఛాపురం మండలం బాలకృష్ణాపురం గ్రామ పంచాయతీ పరిధి డెప్పూరు గ్రామం మౌలిక సదుపాయాలకు దూరంగా ఉంది. కేవలం ఎన్నికల సమయంలోనే గుర్తుండే ఆ దళిత గ్రామాన్ని పట్టించుకునే పాలకులే కరువయ్యారు. అధికారులు సైతం ఆ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూసే పరిస్థితి లేదు. ఇరవై కుటుంబాలు నివసించే ఈ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు లేదు, తాగేందుకు మంచినీరు దొరకని పరిస్థితి. బాలకృష్ణాపురం నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో పంట పొలాలు మధ్య ఉండే ఈ గ్రామంలో రాత్రి సమయంలో వీధి దీపాలు కూడా వెలగకపోవడంతో నిత్యం విష సర్పాలు, జంతువులతో సహవాసం చేస్తున్నామని, ఒంటరిగా బయటకు రాలేని పరిస్థితి తమదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 40 మంది నివాసం ఉండే గ్రామంలో ఉన్న ఒక్క మంచినీటి బోరు మరమ్మతుకు గురికావడంతో మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ వేసిన కొళాయి ద్వారా చుక్క నీరు కూడా రావడం లేదని.. దీంతో పరిశుభ్రం లేని బావి నీటినే తాగునీరుగా ఉపయోగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే ప్రాథమిక విద్య చదవాలంటే రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న బాలకృష్ణాపురం నడక దారిన వెళ్లాల్సిందే. అలాగే హైస్కూల్ చదువు కోసం సుమారు ఎనిమిది కిలో మీటర్లు దూరంలో ఉన్న ఇచ్ఛాపురం నడక దారిన వెళ్లాల్సిన పరిస్థితి. ఒంటరిగా పిల్లలను బడికి పంపించలేక తల్లిదండ్రులు మధ్యలోనే మాన్పించేస్తున్నారు. ఇదిలా ఉండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరుకులు ఇచ్చేందుకు నేరుగా అదే గ్రామానికి వాహనం వెళ్లేది. కూటమి ప్రభుత్వం వచ్చాక బాలకృష్ణాపురం వెళ్లాల్సి వస్తుందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ల కోసం బాలకృష్ణాపురం వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందంటున్నారు.



డెప్పూరు గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాం



మా గ్రామంలో తాగేందుకు మంచినీరు లభించడం లేదు. రాత్రి వేళ ఒక వీధి దీపం వెలుగుతోంది. గ్రామం నుంచి రాకపోకలు సాగించాలంటే గోతులు మయమైన గోర్జే గతి. అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– చెల్లి దిలీప్, డెప్పూరు

అధ్వానంగా రోడ్డు



చేతిలో కర్ర లేనిదే బయటకు అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నాది. రేషన్ సరుకుల కోసం నడక దారిన బాలకృష్ణాపురం వెళ్లాలి. గతంలోని జగన్ బాబు మా ఊరికే రేషన్ సరుకులు పంపించేవాడు. మాకు జబ్బు, జ్వరాలు చేస్తే వైద్యులురారు. అడవిలో ఉన్నట్లు ఉంటున్నాం.

– కుంది కురమ్మ, వృద్ధురాలు, డెప్పూరు

పాయితారిలో ఉచిత వైద్య శిబిరం



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ సురేష్‌రెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డీఎస్ఆర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ దల్లి సురేష్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పాయితారిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులు అందజేశారు. డాక్టర్ సత్తి నాగరమ్య, సర్పంచ్ కుందేశి ప్రియా నాయక్, వలపల వెంకటరమణ, ప్రకాశ్ నాయక్ పాల్గొన్నారు.

నేటి రణభేరి జాతాలో పాల్గొనండి

నందిగాం: విద్యారంగ, ఆర్థిక సమస్యలపై పలాస నుంచి ఆదివారం ప్రారంభంకానున్న రణభేరి జాతాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు కుమారస్వామి, బాలక శంకరరావు ఆదివారం కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచిన ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కాలేద రన్నారు. దీన్ని నిరసిస్తూ నిర్వహిస్తున్న జాతా ఉదయం 11.30 గంటలకు నందిగాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుంటుందని తెలిపారు.

తపాలా ఉద్యోగుల హక్కుల అణచివేత తగదు



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

సోంపేట: తపాలశాఖ ఉద్యోగుల హక్కులను కేంద్ర ప్రభుత్వం అణచి వేయడం దారుణమని సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ డాక్ సేవక్స్ జిల్లా యూనియన్ ఆదేశాల మేరకు ఆదివారం సోంపేటలో గ్రామీణ డాక్ సేవక్స్ ప్రాంతీయ సమావేశాన్ని నిర్వహించారు. గ్రూప్–సీ రాష్ట్ర అధ్యక్షుడు గణపతి, జిల్లా ఉపాధ్యక్షుడు రాము తదితరులు మాట్లాడుతూ.. ఉద్యోగుల హక్కులను అణచి వేస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును వివరించారు. 2026 జనవరి నుంచి అమలు చేయాల్సిన ఎనిమిదో వేతన సవరణపై ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్ పేరుతో ఉద్యోగులకు ఉన్న హక్కులను హరించి వేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్ పోరాటలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు బాబూరావు, నందికేశ్వరరావు, శివకుమార్, సురేష్, జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



కంచిలి: హిందీ కవుల వేషధారణలో విద్యార్థులు



ఇచ్ఛాపురం రూరల్: అపరిజిత బెహరాను సత్కరిస్తున్న దృశ్యం

కంచిలి: బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హిందీ భాష గొప్పతనాన్ని, కవులు, వారు రచనలు గురించి పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా హిందీ కవులు రైదాస్, సురదాస్, కబీర్‌దాస్, తులసీదాస్, మీరాభాయి బాటను అనుసరించాలని పిలుపునిస్తూ వారి భక్తులుగా వేషధారణలో విద్యార్థులు అలరించారు.

ఇచ్ఛాపురం రూరల్: రాజభాషకు జేజేలు పలుకుదామని నేషనల్ వలంటీర్ హంగీర్ బెహరా అన్నారు. హిందీ దివస్ సందర్భంగా ఈదుపురం కంద్రా వార్డులో హిందీ భాషోపాధ్యాయుని అపరిజిత బెహరాను సత్కరించారు. ఇన్‌లాండ్ ఫిషర్స్ సొసైటీ అధ్యక్షుడు రామచంద్ర బెహరా, యువకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ



కవిటి: జీకరాపాడులో నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణదాస్, పిరియా విజయ, నర్తు రామారావు తదితరులు



పలాస:పరామర్శలో మాజీమంత్రి అప్పలరాజు తదితరులు

కవిటి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, సానుభూతిపరుల కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం పరామర్శించారు. బొరివంకలో మాజీ సర్పంచ్ బి.శ్రీరాంప్రసాద్ తల్లి మరణించడంతో వారి కుటుంబాన్ని, బెంతొ ఒరియా సంఘం నేత భాగీరథి దొళాయి మృతితో వారి కుటుంబాన్ని, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్తు నారాయణరావుతో మృతితో కరాపాడులో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియజేశారు. అలాగే బిగొనపపుట్టుగ సర్పంచ్ బద్రి ప్రకాష్ తల్లి రవణమ్మ సంస్మరణ సభలో కృష్ణదాస్ పాల్గొన్నారు.ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు కడియాల ప్రకాష్, పైల దేవదాస్‌దాస్‌రెడ్డి, ఇప్పిలి కృష్ణారావు, నర్తు నరేంద్రయాదవ్, సాడి శ్యాంప్రసాద్, ఉప్పాడ రాజారెడ్డి, చిట్టిబాబు ఉన్నారు.

మాజీమంత్రి పరామర్శ

పలాస: పలాస మండలం అల్లుకోల గ్రామానికి చెందిన దువ్వాడ జానకీరామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం మృతిని కుమారుడు కాంతారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మండల పార్టీ నాయకులు ఉంగ సాయిక్రిష్ణ, దువ్వాడ రవి, పలాస–కాశీబుగ్గ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిష్టు గోపి, మందస ఎంపీపీ డొక్కర దానయ్య, చింతాడ మాధవరావు, కొర్ల సంతోష్, బమ్మిడి సంతోష్‌కుమార్, ఖగేశ్వర దొర, దువ్వాడ లోకేశ్వరరావు ఉన్నారు.

మొక్కలు నాటివేత



మందస మండల కేంద్రం సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మందస అభివృద్ధి కమిటీ (గోగ్రీన్) ఆధ్వర్యంలో రోడ్డు డివైడర్లపై ఖాళీ స్థలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేస్తున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు. కమిటీ సభ్యులు గిన్ని తిరుపతి రెడ్డి శానాపతి కిశోర్, వడ్డి చంద్రశేఖర్, ఇప్పిలి చిట్టి, తెలుకుల గణేష్ సంతోష్ పండా, సత్యం, సోమనాథ్, శ్రీనివాస పాడి, కోదండ, గోపాల్ ఉన్నారు.

– మందస

పారిశుద్ధ్య పనులు



పలాస: పలాస మండలం బొడ్డపాడు గొల్లవీధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు ఆదివారం చేపట్టారు. కొన్ని నెలలుగా ఊరు శివారులో చెత్త కుప్పలతో నిండిఉంది. అలాగే పరిసరాలు పిచ్చిమొక్కలతో ఇబ్బందిగా మారింది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. విషయం గమనించి జెస్సీ ఈవెంట్స్ ఆర్గనైజర్ కిక్కర డిల్లీరావు పొక్లయినర్‌ను ఏర్పాటు చేసి చెత్తను తొలగించి ట్రాక్టర్ ద్వారా గ్రామ శివార్లోకి తరలించారు. పరిసరాలను శుభ్రం చేయించారు. యువకులు కూడా ఈ కార్యక్రమానికి సహకరించారు.

–పలాస

అర్చకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కవిటిలోని చింతామణి గుడి అర్చకుడిగా పనిచేసిన గోపాల్ జన్ని అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎస్‌జీఎఫ్ సంస్థ ప్రతినిధుల దృష్టికి మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ తీసుకెళ్లారు. దీంతో వారు 11 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి ఆదివారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.

–కవిటి